క్లుప్తంగా

10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఈవో వేముల నాగయ్య



మాచర్ల: పట్టణంలో, మండలంలో 10వ తరగతికి సంబంధించి మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంఈవో వేముల నాగయ్య ఆదివారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పరీక్షలలో 1,420 విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పట్టణంలోని కిడ్స్, జిల్లా పరిషత్ బాలురు, బాలికల పాఠశాలల్లో, సెయింటాన్స్ ఇంగ్లీషు, తెలుగు మీడియం, విజయపురిసౌత్‌లో గిరిజన పీటీజీ, ప్రభుత్వ హైస్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకు సంబంధించి హాల్ టికెట్స్‌ను 4వ తేదీ సోమవారం నుంచి పొందవచ్చన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



గురజాల : సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందించారు. స్థానిక పంచాయతీ రాజ్ బంగ్లాలో అంజనాపురం గ్రామానికి చెందిన జక్కిరెడ్డి బ్రహ్మారెడ్డికి రూ.90 వేలు, జొన్నలగడ్డ శివాజీకి రూ.55 వేలు, మాడుగుల గ్రామానికి చెందిన ఆకుల పూర్ణచంద్రరావుకు రూ.1లక్ష , పల్లెగుంతకు చెందిన తాళ్లూరి కరుణాకర్‌కు రూ.5లక్షలు రూపాయలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని బుజ్జి, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, పల్లెగుంత సర్పంచ్ వి.మల్లయ్య, మాడుగుల మాజీ సర్పంచ్ బండ్ల వెంకయ్య, మాజీ జెడ్పీటీసీ బి.ఇష్టకామిరెడ్డి, దీకొండ నరేష్, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, శివారెడ్డి తదితరులున్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

దాచేపల్లి : ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని రామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న కలవకొలను చంద్రశేఖర శాస్త్రి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి కల్యాణ మండపంలో చంద్రశేఖర శాస్త్రి ఉద్యోగ విరమణ సత్కారసభ ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాంబయ్య మాట్లాడుతూ ఎంతో మంది భావిభారత పౌరులను తీర్చిదిద్దే గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, ఈ వృత్తి సమాజంలో గౌరవం పెంచుతుందన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు లింగిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఆణిముత్యం లాంటి వ్యక్తి చంద్రశేఖరశాస్త్రి అని, నేటితరం ఉపాధ్యాయులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం శాస్త్రి దంపతులను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నేత చెట్టిపాగు ఏసురత్నం, మందా రాజశేఖర్, కొసూరి రవికుమార్, చెట్టిపాగు రాములు, యూటీఎఫ్ నేత వట్టెపు నాగేశ్వరరావు, తగరం ఆనంద్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా



దాచేపల్లి : తాగునీటి ఎద్దడి నివారణకు వైఎస్సార్‌సీపీ నేతలు చర్యలు తీసుకున్నారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ఆదివారం సరఫరా చేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి బోర్లకు నీరు అందకపోవటంతో నీటి సమస్య ఉందని స్థానికులు వివరించారు. తక్షణమే స్పందించిన ఆయన వైఎస్సార్‌సీపీ నేత బొల్లా శ్రీనివాసరావు, సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావుకి నీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. దీంతో ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా నీటిని గ్రామంలోని ప్రతి కాలనీకి చేరుస్తున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో బోర్లకు నీరు అందటం లేదని, ఎమ్మెల్యే కాసు స్పందించి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవటం సంతోషంగా ఉందని గ్రామస్తులు చెప్పారు. తాగునీటి సరఫరా ప్రక్రియను ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, ఉప సర్పంచ్ కొట కొండలు, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, నాయకులు నెల్లూరి రామారావు, చుండు రామారావు, మోమిన్ నాగుల్‌మీరా, జక్కుల వీరాస్వామి, నెల్లూరి కోటేశ్వరరావు, సంకురాత్రి చిరంజీవి, హనుమంతరావు పర్యవేక్షిస్తున్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి
- నియోజకవర్గంలోని మండలాల్లో 95 శాతంపైగా పూర్తి



పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి

వెల్దుర్తి: దేశంలో పోలియో మహమ్మారిని తరిమికొట్టి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోలియో బూత్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. 5 సంవత్సరాలలోపు వయసు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పోలియో వలన వికలాంగులు అయ్యే పరిస్థితి ఉందని, చిన్నప్పుడే అన్ని జాగ్రత్తలు తీసుకుంటే పోలియో సోకకుండా అడ్డుకోవచ్చన్నారు. ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2,088 మంది చిన్నారులుండగా 2,042 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. 98 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన కొద్దిపాటి మందికి ఇంటింటికి వెళ్లి వేస్తామన్నారు. 15 బూత్‌లలో రెండు రూట్లు, 1 మొబైల్ టీం ద్వారా మారుమూల తండాలలో సైతం పోలియో చుక్కలు వేశామన్నారు. శిరిగిరిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2,852 మంది చిన్నారులుండగా 2,791 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన చిన్నారులకు ఇళ్లకు వెళ్లి వేస్తామన్నారు. 89 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా 49 హైరిస్కు ప్రాంతాలలో 97.8 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీరామ్, ముఖర్జీ బాయి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, నర్సులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు చపారపు లచ్చిరెడ్డి, దుబ్బా సీయోను, గాలి మరియదాసు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

విజయవంతంగా పల్స్ పోలియో

దాచేపల్లి : పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం మండల వ్యాప్తంగా ఆదివారం చేపట్టారు. నగర పంచాయతీతో పాటు మండల వ్యాప్తంగా 6,215 మంది చిన్నారులకు గాను 5,754 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నగర పంచాయతీ పరిధిలో చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ, గ్రామీణ ప్రాంతాల్లో జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, ఎంపీపీ కటకం జయశ్రీలు పోలియో చుక్కల కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యులు పి.సుచరిత, ఐ.అమూల్య, మధుసూధన్, షాహిన్‌సుల్తానా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో 05 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు చిన్నారులకు వేస్తామని డాక్టర్ సుచరిత చెప్పారు.

కారెంపూడి మండలంలో 5,403 మంది చిన్నారులకు..

కారెంపూడి: మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 5,403 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు ఆదివారం పోలియో డ్రాప్స్ వేశారు. కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలో 3,960 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుని 3,636 మందికి వేశారు. పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.రమ్య, కె.లక్ష్మీమౌనిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. ఇదిలా ఉంటే గాదెవారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో 1,836 మంది చిన్నారులకు గాను 1,767 మందికి పోలియో డ్రాప్స్ వేయడం జరిగిందని పీహెచ్‌సీ డాక్టర్లు విజయానాయక్, లక్ష్మణరెడ్డి తెలిపారు.

కొప్పునూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో 97 శాతం పోలియో చుక్కలు

విజయపురిసౌత్: మాచర్ల మండలం కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో 97శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మొత్తం 2,197 మంది చిన్నారులకు గాను 2,140 మందికి పోలియో చుక్కలు వేశారు. కొప్పునూరు ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రవీణ్ ఆధ్వర్యంలో మండలంలోని కొప్పునూరు, అలుగురాజుపల్లి, హస్నాబాద్ తండా, నాగులవరం, బీకే పాలెం, సుబ్బారెడ్డి పాలెం, బోధనంపాడు చెంచుకాలనీ, చింతలతండా, అనుపు చెంచుకాలనీ, విజయపురిసౌత్‌లోని సాగర్‌మాత దేవాలయం, లాంచీస్టేషన్, డౌన్ మార్కెట్, లంకమోడు ప్రాంతాలలో పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. లాంచీస్టేషన్ వద్ద లాంచీయూనిట్ మేనేజర్ అడపా సాంబ శివారెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ చార్లెస్‌వెస్లీ, డాక్టర్ ముక్తియార్ జాని, సూపర్‌వైజర్స్ సుబ్బాచారి, పద్మావతి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగురాళ్ల పట్టణంలో 95 శాతం పల్స్ పోలియో

పిడుగురాళ్ల: పట్టణంలోని మూడు అర్బన్ హెల్త్ సెంటర్‌ల పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. 5,700 మంది అప్పుడే పుట్టిన బిడ్డల నుంచి 5 సంవత్సరాల వయసున్న చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. వీరిలో సుమారు 5,090 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారని వైద్యులు తెలిపారు. 95 శాతం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తామని వైద్యులు తెలియజేశారు. ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అనిల్‌కుమార్, అమరేశ్వరరెడ్డి, రవితేజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

97.4 శాతం పోలియో చుక్కలు

గురజాల : పోలియో చుక్కలు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మాడుగుల పీహెచ్‌సీ పరిధిలో 5 సంవత్సరాలలోపు 3,197 మంది చిన్నారులు ఉండగా 3,115 మందికి పోలియో చుక్కలు వేశామని, 97.4 శాతం నమోదు జరిగిందని వైద్యులు తెలిపారు. అదే విధంగా గురజాల నగర పంచాయతీ పరిధిలోని గురజాల-జంగమహేశ్వరపురంలో 2,379 మంది చిన్నారులు ఉండగా 2,277 మందికి పోలియో చుక్కలు వేసినట్లు 96 శాతం నమోదైనట్లు వైద్యులు తెలిపారు.

విజయవంతంగా పల్స్ పోలియో

మాచర్ల: పట్టణంలో పల్స్ పోలియో కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్, చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, పల్స్ పోలియో వైద్యశాఖాధికారి శివలీలలు ఆదివారం ఉదయం ప్రారంభించారు. పట్టణంలో మొత్తం 34 కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 6,208 మంది చిన్నారులకు గాను 6,078 మందికి అనగా 98 శాతం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. 0-5 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా కేంద్రాలలో పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ శివలీల, ప్రభుత్వాసుపత్రుల వర్కింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ రామకోటయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ, కార్యదర్శి పఠాన్ నాగూర్‌వలి, సత్యప్రసాద్, చందోలు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్, కేసీపీ వారి ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రాల వద్ద ముమ్మరంగా కార్యక్రమం నిర్వహించారు.



దాచేపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం



అర్బన్ హెల్త్ సెంటర్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కౌన్సిలర్లు



పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది



లాంచీస్టేషన్ వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న లాంచీయూనిట్ మేనేజర్ శివారెడ్డి



పోలియో డ్రాప్స్ వేస్తున్న అల్లయ్య, చంద్రశేఖరరెడ్డి

పల్స్ పోలియో విజయవంతం



వేమవరంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ శివాయాదవ్ తదితరులు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ప్రసాదరావు తెలిపారు. మాచవరం సెక్టార్ పరిధిలో 95.08 శాతం, పిల్లుట్ల సెక్టార్ పరిధిలో 95.28 శాతం నమోదయినట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులకు, మండల స్థాయి అధికారులకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమాల్లో వైద్యులు అన్వేష్, నస్రీన్, హెచ్‌వో చిన్నమ్మ, హెచ్ఈవో వీరయ్య, పీహెచ్ఎన్ చిన్నారి రోజా, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనే లక్ష్యం

రెంటచింతల: పుట్టిన ప్రతి బిడ్డకు రెండు పోలియో చుక్కలను వేయడం ద్వారా వారికి మనం పరిపూర్ణమైన నిండు జీవితాన్ని ఇవ్వొచ్చని ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ అన్నారు. ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె చిన్నారులకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డితో కలిసి పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. దేశంలో పోలియో లేకుండా సమూలంగా నిర్మూలించడంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అంకితభావంతో విధులు నిర్వహించి విజయవంతం చేసినందుకు అభినందించారు. మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలో మొత్తం 3,624 మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు ఉండగా 20 పల్స్ పోలియో కేంద్రాలు, ఓ మొబైల్ టీం ద్వారా 98 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సేవలు అందించిన 120 మంది సిబ్బందికి ఇగుటూరి నరేంద్రారెడ్డి భోజనం ఏర్పాట్లు చేయగా కాకుమాను రామారావు పులిహోర, యేచూరి వెంకట సైదయ్య మజ్జిగ ప్యాకెట్లు అందజేసి సహకరించిన వారికి డా.కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



చిన్నారికి పోలియో చుక్కలను వేస్తున్న ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరుగుతున్నట్లు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్ళపల్లి గ్రామానికి చెందిన పున్నా బ్రహ్మం, బొజ్జ కల్పన, కరంటోతు శ్రీను నాయక్‌తో పాటు బీసీ, ఎస్టీలకు చెందిన 15 కుటుంబాలు పార్టీలో చేరాయి. టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ చేరారు. పార్టీలో చేరిన వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు నేరుగా అర్హులకు అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు వారికి సంబంధించిన వారికి సంక్షేమ పథకాలు ఇచ్చే వారని, అలా కాకుండా కుల, మత, రాజకీయాలకతీతంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యల్లాల బ్రహ్మయ్య, పుట్టి బ్రహ్మయ్య, సూరత్ శ్రీనునాయక్, దేరంగుల అమ్మోరయ్య, సర్పంచ్ గాలెయ్య, వెంకట్రామయ్య, అంకయ్య, సంపతి శేఖర్, కొండా కృష్ణ, పేర్ల చౌడయ్య, కుక్కడాల రామారావు, గంజి రంగా, సిరికరు బ్రహ్మం, దాసరి అమరలింగం, పేరసాల అంజయ్య, తిరుపతిరావు, అనుమోలు పున్నయ్య, బొక్కల భూమయ్య, బూడిద శ్రీను, ఉప ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, తురకా కిషోర్, జింకల వెంకటేశ్వర్లు, కొండా తదితరులున్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా పాలన

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మోటారు స్విచ్ ఆన్ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: బడుగు, బలహీన వర్గాల ఆర్థిక సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంతో అమోఘమని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం అన్నారు. మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో తాగునీటి కోసం బోరు, మోటారును ప్రారంభించి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నారన్నారు. గ్రామీణ ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తున్నారన్నారు. పేద ప్రజల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరికీ అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తూ సంక్షేమ సీఎంగా దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో మంచినీటి కొరత లేకుండా బోరు, మోటారులు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రైతన్నల సంక్షేమం కోసం వైఎస్సార్ జలకళ పథకం ద్వారా రైతులందరికీ ఉచితంగా బోర్లు, మోటారు, విద్యుత్ కనెక్షన్ అందించి రైతు సంక్షేమ రాజ్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని పీఆర్కే తెలిపారు. అన్ని వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారని, ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు మరోసారి మనమందరం అండగా నిలిచి సంక్షేమ రాజ్యాన్ని మళ్లీ తెచ్చుకుందామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు, పోతిరెడ్డి కోటిరెడ్డి, ఎల్లా బ్రహ్మయ్య యాదవ్, పుట్టా బ్రహ్మయ్య, శ్రీనునాయక్ తదితరులున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దాచేపల్లి : మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో చెట్టినాడ్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. సూమారు 35 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో ఎస్‌ఐ జీ సంధ్యారాణి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శరీరమంతా కుళ్లిపోయే స్థితిలో ఉండటంతో ఐదు రోజుల క్రితమే ఉరి వేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి శరీరంపై టీషర్ట్, పంచె ఉంది. మృతుడి ఆచూకి తెలిసిన వ్యక్తులు దాచేపల్లి సీఐ 9440796239 నెంబర్‌ని సంప్రదించాలని ఎస్‌ఐ సంధ్యారాణి కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నాం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ప్రజ తాగునీరు అందించేందుకు వాటర్ ట్యాంకర్‌ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



వడియరాజులకు ఇంటి పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : భూగర్భ జలాలు అడుగంటిపోవటంతో నెలకొన్న మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి మొట్టమొదటి చైర్మన్ దివంగత మునగా రమాదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ట్యాంకర్‌ని దాచేపల్లిలో ఆమె స్వగృహం వద్ద ఆదివారం ఎమ్మెల్యే కాసు ప్రారంభించారు. దాచేపల్లికే జీవనది లాంటి నాగులేరు ఎండిపోవటం వలన దాచేపల్లి, కేసానుపల్లి, తక్కెళ్లపాడు, నారాయణపురం, గామాలపాడు గ్రామాలకు తాగునీటి సమస్య వచ్చిందని, సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేసిన నీటిని నాగులేరుకి తరలించమని జిల్లా కలెక్టర్‌ని కోరామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. నాగులేరులోకి నీరు వస్తే భూగర్భ జలాలు పెరిగి బోర్లు పని చేస్తాయని, ప్రజలకు నీరు అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రస్తుతం నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు మండల పరిధిలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీల యజమానులతో చర్చించామని, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరాఫరా చేసేందుకు అంగీకరించారని చెప్పారు. నీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాల్లో ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతల సహకారంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, ఎంత ఖర్చయిన తాగునీటిని ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు మునగా రమాదేవి చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావటం అభినందనీయమని, మరిన్ని సంస్థలు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కాసు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు అందిస్తాం

పిడుగురాళ్ల: ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి స్థలం అందించి వారికి పక్కా గృహాలు నిర్మించటమే తమ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వడియరాజులకు 33వ వార్డులోని స్వర్ణ పిచ్చయ్య కాలనీ సమీపంలోని వడ్డెర ఓబన్న కాలనీని ఏర్పాటు చేసి అందులో సుమారు 100 మందికి ఇళ్ల పట్టాలు అందించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతులమీదుగా ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికి 7,800 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం, ఇంకా కొందరు పేదలకు ఇళ్ల స్థలాలు లేవని తన దృష్టికి నాయకులు తేవడంతో వెంటనే ఎస్సీ కాలనీ సమీపంలో రెవెన్యూ అధికారులతో సర్వే నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయించి అందించడం జరిగిందన్నారు. పేదలను ఆదుకోవడంలో వైఎస్సార్‌సీపీ రాజీ లేని సేవలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. పట్టణంలో సుమారు 19,000 గృహాలు ఉంటే, పేదలకు మన ప్రభుత్వంలో ఇప్పటి వరకు పిడుగురాళ్ల పట్టణంలోనే సుమారు 8 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల్లోని పేదలను అభివృద్ధి పథంలో నడిపించడంలో ముందున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, పట్టణ బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పు వేంకటేశ్వర్లు, దేవళ్ల రామారావు, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెలగపూడి సేవలు చిరస్మరణీయం

మాచర్ల: రాష్ట్రంలో అత్యంత గొప్ప పారిశ్రామికవేత్తగా ఎదిగి మాచర్ల ప్రాంతంలో ది కేసీపీ సిమెంట్స్ లిమిటెడ్ సంస్థను స్థాపించి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి సిమెంట్ సప్లై చేసి కీలకపాత్ర పోషించిన వెలగపూడి రామకృష్ణ అత్యంత పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. ఆయన జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలను మాచర్ల కేసీపీలో మార్చి 4వ తేది సోమవారం నిర్వహించనున్నారు. నగరం మండలంలోని బెల్లంవారి పాలెంలో వెలగపూడి సుబ్బయ్య, శాంతమ్మలకు 2వ కుమారుడుగా రామకృష్ణ జన్మించాడు. ఉన్నత విద్యను చదివి ఆక్స్‌ఫర్డ్‌లో డిగ్రీ పొందాడు. చంగల్‌పట్టు అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశాడు. అనంతరం పారిశ్రామికవేత్తగా మారి కేసీపీ సంస్థను మాచర్లలో ఏర్పాటు చేశారు. అదే విధంగా అనేక విద్యా సంస్థలకు స్థలమిచ్చి విద్యావేత్తగా గుర్తింపు పొందాడు. ఎన్నో విజయాలు సాధించిన రామకృష్ణ సేవలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏడాది మార్చి 4న జయంతి సందర్భంగా అనేక శ్రమదాన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కేసీపీ సంస్థ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను సోమవారం నిర్వహించనున్నట్లు జనరల్ మేనేజర్ వెంకటరమణ, హెచ్ఆర్ మేనేజరు వెంకటేశ్వరరావులు తెలిపారు.